క్లుప్తంగా

మోడల్ స్కూల్లో అడ్మిషన్లు

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి వద్ద ఉన్న మోడల్ స్కూల్లో 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ప్రిన్సిపాల్ ఫణీంద్ర శుక్రవారం తెలిపారు. 7వ తరగతిలో 2 సీట్లు, 8వ తరగతిలో 2 సీట్లు, 9వ తరగతిలో 4 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అడ్మిషన్ల కోసం విద్యార్థులు ఈ నెల 28వ తేదీలోపు మోడల్ స్కూల్లో దరఖాస్తులను సమర్పించాలన్నారు. 30న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు.

నందవరం: ముగతి ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. 7వ తరగతిలో 18 సీట్లు, 8వ తరగతిలో 4, 9వ తరగతిలో 5 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు.ఆసక్తి గల విద్యార్థులు 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని 30న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

కృష్ణగిరి: స్థానిక మోడల్ స్కూల్‌లో 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం శనివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకు పరీక్షకు హాజరుకావాలని సూచించారు. ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి 85 మంది పరీక్ష రాయగా మెరిట్, నిబంధనల మేరకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు వెల్లడించారు.

అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

మద్దికెర: ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ రవి హెచ్చరించారు. శుక్రవారం మద్దికెరలోని కోర మాండల్, ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాపు యజమానులకు సూచనలు చేశారు. రైతులకు ఎరువులు, విత్తనాలు విక్రయించినపుడు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని అందులో డీలర్ సంతకం, బ్యాచ్ నంబర్, లాట్ సంఖ్య, ముగుస్తున్న తేదీతో పాటు రైతు సంతకం తప్పనిసరిగా ఉండాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చట్టప్రకారం చర్యలు తప్పవన్నారు.

ఎంఈఓ-2 బాధ్యతల స్వీకరణ


చిరంజీవిరెడ్డి

ఆలూరు రూరల్: స్థానిక ఎంఈఓ-2గా చిరంజీవి రెడ్డి నియమితులయ్యారు. ఆదోని మండలం బల్లేకల్ జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా పనిస్తున్న చిరంజీవి రెడ్డిని ఆలూరు ఎంఈఓ-2గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

టీచర్లను నియమించాలి

హొళగుంద: హొళగుందలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎస్కే గిరి శుక్రవారం కర్నూలులో డీఈఓ రంగారెడ్డిని కోరారు. పాఠశాలలో 1,800 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటుంటే వారికి సరిపడా టీచర్లు లేరన్నారు. రాష్ట్రంలో తెలుగు, ఇంగ్లిష్, కన్నడ, ఉర్దూ నాలుగు మీడియంలు ఉన్న ఏకైక పాఠశాల ఇదని ఇక్కడ టీచర్ల కొరత తీవ్రంగా మారిందని, దీనివల్ల విద్యార్థులకు పూర్తి స్థాయిలో విద్య అందడం లేదన్నారు. వెంటనే స్పందించి హొళగుంద హైస్కూల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

తుగ్గలి: మండల పరిధిలోని దేశాయతండాలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు జెడ్పీటీసీ సభ్యుడు పులి కొండనాయక్ తెలిపారు. శుక్రవారం తండాలో చేపట్టిన విద్యుత్తు లైన్ పనులను ఆయన పరిశీలించారు.తండాలో నీటి సమస్య నెలకొనడంతో ఇప్పటికే ఎమ్మెల్యే శ్రీదేవి చొరవతో ట్యాంకరు ఏర్పాటు చేశారన్నారు. నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు బోరు కూడా వేశామని,జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన పైపులైన్ పనులు కూడా పూర్తయ్యాయన్నారు. విద్యుత్తు లైన్ పనులు పూర్తి చేసి త్వరలో తాగునీరు సరఫరా అయ్యేలా చూస్తామన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సోమశేఖర రెడ్డి, దివాకర్, హనుమన్న వెంట ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మోహన్‌రెడ్డి

గోనెగండ్ల: గ్రామాల్లో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గంజిహల్లి గ్రామంలో శుక్రవారం ఎస్ఐ తిమ్మారెడ్డితో కలిసి సీఐ పర్యటించారు. గ్రామంలోని సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మైనర్ బాలికపై అత్యాచార యత్నం జరిగిన స్థలానికి వెళ్లి విచారించారు. ఈ ఘటనలో ఎవరి ప్రమేయం ఉన్నా వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పోలీసు సిబ్బంది వెంట ఉన్నారు.

వైఎస్సార్ బీమాతో ధీమా

- నియోజకవర్గంలో 84,303 మందికి లబ్ధి
- వ్యక్తిగత ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది
- గ్రామాల్లో నమోదు చేస్తున్న వలంటీర్లు
- పేద కుటుంబాలకు ప్రయోజనం


బీమా అర్హులను నమోదు చేస్తున్న వలంటీర్


బాధిత కుటుంబానికి తక్షణ సాయం అందిస్తున్న అధికారులు

మద్దికెర: నిరుపేదల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. తాజాగా కుటుంబాన్ని పోషించే వ్యక్తి ఆకస్మికంగా మరణిస్తే వారిని ఆదుకునేందుకు పథకాన్ని రూపొందించింది. ఆ కుటుంబం వీధిన పడకుండా ఆదుకునేందుకు ఉచిత బీమా పథకాన్ని ప్రారంభించింది. గతంలో ఉన్నట్టుగా ప్రతి పాలసీకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే వాటా లేనప్పటికీ దేశంలో ఎక్కడాలేని విధంగా పూర్తి ఖర్చు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. అంతేగాక మొత్తం ప్రీమియాన్ని చెల్లిస్తుంది. పేద కుటుంబం మీద ఒక్క రూపాయి కూడా భారం పడకుండా ఉచిత బీమా అమలు చేస్తున్న ప్రభుత్వం. దీనికి రైస్‌కార్డు అర్హతగా నిర్ణయించింది. బీమా అమలు బాధ్యతను డీఆర్‌డీఏలోని బీమా విభాగం చేపడుతోంది. ఇందులో భాగంగా క్షేత్రస్థాయిలో సచివాలయ సంక్షేమ అధికారులు, వలంటీర్లు సర్వే చేపట్టి అర్హుల వివరాలు నమోదు చేస్తున్నారు.

పేద కుటుంబాలకు లబ్ధి

ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా నిరుపేదలకు సామాజిక భద్రతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం 1.50 కోట్ల రైస్‌కార్డు కలిగిన కుటుంబాలకు ఈ బీమా వర్తింపజేస్తోంది. నియోజకవర్గంలో 84,303 బియ్యం కార్డులున్నాయి. వీరిలో బ్యాంకు ఖాతాలున్న వారిని, లేనివారిని నమోదు చేసే సర్వేను సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కార్యదర్శుల పర్యవేక్షణలో వలంటీర్లు చేపడుతున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు ప్రక్రియ చేస్తున్నారు.

బీమా వల్ల ప్రయోజనాలు

వైఎస్సార్ బీమా పథకానికి 18 నుంచి 70 ఏళ్ల వయసున్న బియ్యం కార్డుదారులను అర్హులుగా గుర్తిస్తారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య సహజ మరణం పొందితే ఆ కుటుంబసభ్యులకు రూ.లక్ష బీమా లభిస్తుంది. 51 నుంచి 70 ఏళ్ల మధ్య వాళ్లు ప్రమాదం వల్ల మరణం, పూర్తి అంగవైకల్యం పొందితే రూ.5 లక్షలు వారి వారసులకు అందజేస్తారు.

మండలాల వారీగా బీమాకు అర్హులైన వివరాలు

మండలం	రైస్ కార్డులు	ఈ-కేవైసీ చేసినవి	శాతం
మద్దికెర	11,166	8,834	98
తుగ్గలి	19,117	15,578	93
పత్తికొండ	19,890	16,693	96
కృష్ణగిరి	14,262	11,387	94
వెల్దుర్తి	19,868	16,719	95
మొత్తం	84,303	69,211	88

పథకానికి అర్హతలివీ

- రాష్ట్రంలో బియ్యం కార్డుదారుడై ఉండాలి. ఇంట్లో సంపాదించే సంపాదించే వ్యక్తికి బీమా లభిస్తుంది. భార్యాపిల్లలు/వృద్ధులైన తల్లిదండ్రులు నామినీలుగా ఉంటారు.
- ఉమ్మడి కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు కుటుంబ పోషకులుంటే వారిలో పోషించే వ్యక్తిని ఆ కుటుంబం నిర్ణయించుకుంటుంది.
- గ్రామీణ ప్రాంతాల్లోని వారి ఆదాయం నెలకు రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లోని వారి ఆదాయం నెలకు రూ.12 వేలలోపు ఉండాలి.
- మాగాణి భూమి మూడెకరాలు, మెట్టభూమి పదెకరాల కన్నా తక్కువ ఉండాలి.
- పాలసీదారులకు గుర్తింపు కార్డును ప్రభుత్వం అందజేస్తుంది.

ప్రత్యేక యాప్‌లో నమోదు



వైఎస్సార్ బీమా పథకానికి అర్హులైన బియ్యంకార్డుదారులను ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేసే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సచివాలయ సంక్షేమ అధికారులు, వలంటీర్లు చేబడుతున్నారు. బ్యాంకు ఖాతాలు లేని వారిని గుర్తించి వారికి ఖాతాలు తెరిచేందుకు సహకరిస్తారు.

– నరసింహమూర్తి, ఎంపీడీఓ, మద్దికెర

త్వరితగతిన పూర్తి చేస్తాం



జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వైఎస్సార్ బీమా నమోదు త్వరగతిన పూర్తి చేస్తున్నాం. మండలంలోని ఆయా గ్రామాలలో వలంటీర్లకు అవగాహన కల్పించి ఇంటింటికీ వెళ్లి కుటుంబాలను గుర్తించి నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు సహకరించి తప్పనిసరిగా బీమా చేయించుకోవాలి.

– మధుబాబు, వైకేపీ ఏపీఎం, మద్దికెర

టాపర్లకు ప్రోత్సాహక బహుమతులు


వెల్దుర్తి కేజీబీవీలో ఇంటర్ టాపర్లకు బహుమతులు అందిస్తున్న అతిథులు

వెల్దుర్తి: స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయం (కేజీబీవీ)లో ఇంటర్మీడియెట్‌లో టాపర్లుగా నిలిచిన విద్యార్థినులకు జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ షాకీరాబేగం ఆధ్వర్యంలో ఎంపీటీసీ/వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ శైలజ, పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు చేతులమీదుగా నగదు బహుమతులు అందించారు.విద్యార్థినులు బెస్త అనిత, గాయత్రి, ఆకాంక్ష, ఆర్.అనిత బహుమతులు అందుకున్నారు. అనంతరం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందించారు. కేజీబీవీలో మనబడి నాడు-నేడు రెండో విడతలో రూ.12 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్‌ను అతిథులు ప్రారంభించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

లైన్‌మన్ సస్పెన్షన్

దేవనకొండ: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న దేవనకొండ లైన్‌మన్ భాస్కర్‌ను అధికారులు సస్పెండ్ చేశారు. పలుమార్లు హెచ్చరించినా పనితీరు మార్చుకోకపోవడంతో శుక్రవారం జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.

పట్టుబడిన మద్యం ధ్వంసం

తుగ్గలి: నాటుసారా, మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు కేసుల్లో పట్టుబడిన 176.86 లీటర్ల నాటుసారా, 1,684 ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని శుక్రవారం సాయంత్రం తుగ్గలి సమీపంలో పోలీసులు ధ్వంసం చేశారు. ఎస్ఐలు మల్లికార్జున, రామాంజినేయులు, పోలీసులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పాలన


ఎమ్మిగనూరు 24వ వార్డులో లబ్ధిదారుడికి నమస్కరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ప్రజల అభ్యున్నతి, వారి శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం పట్టణంలోని 24వ వార్డు పరిధిలో ఆ వార్డు ఇన్‌చార్జ్ రుద్రాక్షాల బజారి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లు ఇచ్చి పింఛన్లు, సంక్షేమ పథకాలతో చేకూ రుతున్న ప్రయోజనాన్ని అడిగి తెలుసుకున్నారు. సంక్షమపాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి దీవించాలని ప్రజలను కోరారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, మున్సిపల్ వైస్ చైర్మన్లు,వార్డుకౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం


పందికోనలో లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: సీఎం జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం పందికోన గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీదేవి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో అందించిన పథకాలను లబ్ధిదారులకు వివరించారు. పలువురు గ్రామస్తులు సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఎంపీపీ నారాయణదాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరంగడు, ఎంపీడీఓ కవిత,సీఐమురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన


నవధాన్యాల సాగు విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది

వెల్దుర్తి: మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నవధాన్యాల సాగుపై ఆ శాఖ సబ్ డివిజన్ అధికారి షేక్ మాబువలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాఠశాల విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిబ్బంది వెంకటేశ్వర్లు, పరమేశ్వరుడు, రాఘవేంద్ర తదితరులు ప్రధాన కూడలిలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రధాన పంటల సాగుకు ముందు స్వల్ప కాలంలో పంట చేతికి వచ్చే 30 రకాల నవధాన్యాల విత్తనాలను ఎకరానికి 13 కేజీల ప్రకారం వేసుకోవాలన్నారు. రసాయన ఎరువులు వాడకుండా కేవలం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో జీవ రసాయనాలు తయారు చేసుకునే పద్ధతులను వివరించారు. రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నందవరం: తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తెలంగాణ రాష్ట్రం రాజాపురం గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. శుక్రవారం నాగలదిన్నె వద్ద తుంగభద్ర నదిలో తెలంగాణ,గద్వాల జిల్లా, అయిజ మండలం రాజాపురానికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుడగా పట్టుకొని సీజ్ చేసి, డ్రైవర్ తెలుగు నాగేష్, ఓనర్ తిరుమల్లేష్‌పై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

శిశువులకు టీకాలు తప్పనిసరి


వెల్దుర్తి సీహెచ్‌సీలో స్కానింగ్ పరికరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్

వెల్దుర్తి: ఆసుపత్రిలో కాన్పు అయిన వెంటనే పుట్టిన పిల్లలకు జీరో డోస్ టీకాలు (బీసీజీ, పోలియో, డీపీటీ, ఎమ్‌సీవీ తదితరాలు) తప్పనిసరిగా వేయాలని, పిల్లల్లో పుట్టిన సమయం నుంచే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి, గర్భస్థ లింగ నిర్ధారక చట్టం నోడల్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని (సీహెచ్‌సీ) ఆకస్మిక తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించిన ఆసుపత్రిలో టీకాలు నిల్వ ఉంచే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. రికార్డులు, రిపోర్టులు, స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. టీకాల నిల్వ, అందించాల్సిన పద్ధతులపై వైద్యులు, సిబ్బందికి తగు సూచనలందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లింగ వివక్ష నిర్మూలనపై ఆరోగ్య సిబ్బంది గ్రామగ్రామాన అవగాహన పెంచాలన్నారు. లింగ నిర్ధారక పరీక్షలు చట్ట విరుద్ధమని, అలా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. సీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ ప్రతిభా గ్లోరి, డాక్టర్ రంగస్వామి, గర్భస్థ లింగ నిర్ధారక చట్టం ప్రోగ్రాం కన్సల్టెంట్ సుమలత, వైద్య, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

చురుగ్గా రోడ్డు మరమ్మతు పనులు


ఆదోని రోడ్డులో గ్రావెల్ వేసి చదును చేసిన దృశ్యం

హొళగుంద: ఆదోని మార్గంలోని ధణాపురం-హొళగుంద రోడ్డులో తాత్కాలిక మరమ్మతు పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాళ్లు తేలి, గుంతలు పడి అధ్వానంగా మారిన ఈ రోడ్డులో ప్రజలు ప్రయాణించేందుకు ఇబ్బందిగా ఉండేది. ఈ మార్గంలో 25 కి.మీ మేర డబుల్ రోడ్డు ఏర్పాటుకు రూ.59 కోట్లు నిధులు మంజూరై కొద్దిగా పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే కాంట్రాక్టర్ అర్థాంతరంగా పనులు నిలిపి వేశాడు. దీంతో బస్సులను వేరే రూటులో తిప్పిన ఆర్టీసీ అధికారులు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో ఒకటి, రెండు గ్రామాలకు మినహాయించి పాత రూట్లలోనే బస్సులను తిప్పుతున్నారు.

మంత్రి సొంత ఖర్చుతో పనులు

పనులకు సంబంధించి మంత్రి గుమ్మనూరు జయరాం సదరు కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులపై ఒత్తిడి తెచ్చినా ఆలస్యమవుతుండడంతో సోమవారం నుంచి సొంత ఖర్చుతో భారీ వాహనాలు, ఇటాచి, ట్రాక్టర్లు పెట్టి గ్రావెల్ వేసి తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ఇప్పటివరకు దాదాపు 15 కి.మీ హొళగుంద నుంచి హెబ్బటం వరకు దెబ్బతిన్న చోట గ్రావెల్ వేసి రోడ్డును చదును చేశారు. ప్రస్తుతం జరిగిన టెండర్‌ను రద్దు చెయించి ఎస్టిమేట్ కాస్ట్ పెంచి కొత్త రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు మంత్రి చర్యలు తీసుకుంటారని, అలాగే మార్లమడికి రోడ్డు పనులు ప్రారంభమయ్యేలా కృషి చేస్తారని ఆయన సోదరులు గుమ్మనూరు శ్రీనివాసులు, నారాయణస్వామి తెలిపారు.

కిసాన్‌మాల్ దుకాణాల తనిఖీ

హాలహర్వి: మండలంలోని చింతకుంట, గూళ్యం గ్రామాల్లోని కిసాన్‌మాల్ దుకాణాలను శుక్రవారం ఏఓ శివశంకర్ తనిఖీ చేశారు. పత్తి విత్తనాలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్‌లు, బిల్ బుక్‌లు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లు లేకపోవడం, ప్రైస్ బోర్డు అప్‌డేషన్ చేయకపోవడం వల్ల ఐదు కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలు 21 రోజులకు స్టాప్ సేల్ ఇచ్చినట్లు చెప్పారు.

నేడు పెరవలికి ఎమ్మెల్యే రాక

మద్దికెర: పెరవలి గ్రామానికి శనివారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి వస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి తెలిపారు స్థానిక రంగనాథస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్‌గా దస్తగిరిగౌడ్‌తో పాటు కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారంలో పాల్గొంటారన్నారు. కార్యకర్తలు, నాయకులు రావాలని కోరారు.

పక్కాగా నమోదు చేయండి

నందవరం: 'వైఎస్సార్ బీమా' నమోదు పక్కాగా చేపట్టాలని ఎంపీడీఓ దశరథ రామయ్య వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ వలంటీర్లకు సూచించారు. శుక్రవారం గ్రామ సచివాలయంలో వారితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలో వైఎస్సార్ బీమా రెన్యూవల్ 17,547 మంది ఉన్నారని, 15,517 మందికి నమోదు పూర్తయ్యిందన్నారు. అలాగే న్యూ ఎన్‌రోల్‌మెంట్ 2032 మంది ఉండగా 892 మందికి నమోదు పూర్తయిందన్నారు. గ్రామ వలంటీర్లు త్వరగా నమోదు చేయాలని ఆదేశించారు.

చేపల చెరువు నిర్వహణ విషయంలో ఘర్షణ

కృష్ణగిరి: ఆలంకొండ గ్రామంలో కూర్మగిరి చెరువులో చేపల నిర్వహణ విషయంలో శుక్రవారం సాయంత్రం జరిగిన ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గతేడాది గ్రామంలోని 12 మంది కలిసి మూడేళ్లపాటు కూర్మగిరి చెరువులో చేపల పెంపకం హక్కులను రూ.15 లక్షలకు వేలం ద్వారా దక్కించుకున్నారు. ఇటీవల వారి మధ్య మనస్పర్థలు ఏర్పడి డబ్బులు లెక్కలు చేయాలని డోన్‌లో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ చేసుకున్నారు. అయితే శక్రవారం సాయంత్రం నక్క కవింద్ర ఇదే గ్రామానికి చెందిన జిత్తిరి కుమార్ ఇంటికి వెళ్లి మరోసారి లెక్కలు చూపాలని కోరడంతో ఘర్షణ ఏర్పడింది. ఘర్షణలో నక్క కవింద్రతో పాటు మరో ఇద్దరికి, అలాగే జిత్తిరి కుమార్ తోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. కవింద్ర డోన్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పని చేస్తున్నాడు. బాధతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీకే ప్రజా మద్దతు


మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: సీఎం వైఎస్ జగనన్న పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. ఆయన శుక్రవారం హాలహర్విలో మాట్లాడుతూ.. నాలుగేళ్ల జగనన్న పాలనలో అందరికీ మేలు చేసి జనం గుండెల్లో చోటు సంపాదించుకున్నారన్నారు. మరోమారు జగనన్నకు పట్టం కట్టేందుకు జనం సిద్ధంగా ఉన్నారని, మాజీ సీఎం చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పాలనను కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. దిశానిర్దేశం లేని మోసపూరిత మేనిఫెస్టోలు, చౌకబారు మాటలను ప్రజలు గమనిస్తున్నారని, ఆయా పార్టీలకు మరోసారి గుణపాఠం తప్పదన్నారు. స్థానిక నాయకులు వెంట ఉన్నారు.

జగనన్న సురక్ష విజయవంతం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలుచేయనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఉప్పర కల్యాణ మండపంలో వార్డు సచివాలయ సిబ్బందికి కార్యక్రమం నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు, కౌన్సిలర్ల సహకారంతో ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులు ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమయ్యే 11 రకాల సర్టిఫికెట్లు అందించేందుకు సిద్ధం కావాలన్నారు. కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, సీసీఆర్సీ మ్యుటేషన్లు, ఆధార్‌కు ఫోన్ నంబర్ లింక్ వంటి సేవలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఆర్‌ఓ బేబి, ఏఈ మదన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: స్థానిక గ్రామ సచివాలయం-3లో జగనన్న సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సందేశాన్ని మండలాధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించారు. అనంతరం మండలంలో కార్యక్రమం విజయవంతంపై సిబ్బందికి సూచనలిచ్చారు. తహసీల్దార్ నిత్యానందరాజు, ఎంపీడీఓ దశరథ రామయ్య, నాయకులు శివారెడ్డిగౌడ్, సావిత్రి పాల్గొన్నారు.